టిడ్కో ఇళ్ల కోసం ఎదురుచూపు

- అధికారం చేపట్టి ఐదు నెలలు దాటినా నోరు మెదపని ప్రభుత్వం
- రూ.50 వేల నుంచి రూ.లక్ష చొప్పున చెల్లించిన లబ్ధిదారులు
- ఏలూరులో తొలి విడత 2,208 మంది లబ్ధిదారుల గుర్తింపు


పోణంగి రోడ్డులోని టిడ్కో గృహ సముదాయాలు

ఏలూరు (టూటౌన్): ఏళ్ల నాటి నిరీక్షణ ఇప్పటికైనా ఫలించేనా అంటూ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లను పంపిణీ చేసేస్తామంటూ ఉత్తర ప్రగల్బాలు పలికిన కూటమి నాయకులు అధికారం చేపట్టి ఐదు నెలలు దాటినా హామీలను నెరవేర్చకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల నెరవేరడం లేదు. పేదలకు మేలు చేయడంపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి ఎటువంటి చిత్తశుద్ధి లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రచార ఆర్భాటమే తప్ప క్షేత్రస్థాయిలో తమ లాంటి నిరుపేదలకు ఒనకూరే ప్రయోజనం ఏమీ లేదంటూ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో ఇళ్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఏలూరులో 2,208 లబ్ధిదారుల గుర్తింపు

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో టిడ్కో ఇళ్ల కోసం 2018లో మొత్తం 6,480 మంది పేద, మధ్య తరగతి ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలన అనంతరం వచ్చిన దరఖాస్తుల్లో 4,272 మందిని అనర్హులుగా గుర్తించారు. మిగిలిన 2,208 మందిని టిడ్కో ఇళ్లు పొందేందుకు అర్హులుగా నాటి పాలకులు గుర్తించారు. ఈ క్రమంలో నాటి డివిజన్ల కార్పొరేటర్లు తమ చేతి వాటం ప్రదర్శించారు. తమకు తాయిలాలు ఇచ్చిన వారికే టిడ్కో ఇళ్ల కేటాయించే విధంగా చక్రం తిప్పారనే విమర్శలున్నాయి. ఎంపికైన లబ్ధిదారులు సింగిల్ బెడ్ రూమ్ ఇంటికి రూ.50వేలు, డబుల్ బెడ్ రూమ్ ఇంటికి రూ.లక్ష చొప్పున తమ వాటా సొమ్ముగా చెల్లించారు. బ్యాంకు వడ్డీ లెక్క కట్టినా తాము చెల్లించిన మొత్తం రెట్టింపు అయ్యిందని నేటికీ తమకు ఇళ్ల చేతికి అందలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

పోణంగి రోడ్డులో 60 ఎకరాల స్థలంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం

ఏలూరు నగరపాలక సంస్థలో గుర్తించిన టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం నిమిత్తం పోణంగి రోడ్డులో మొత్తం 60 ఎకరాల భూసేకరణ చేసారు. ఆ ప్రాంతంలో ఒక్కో బ్లాకుకు 48 ప్లాట్స్ చొప్పున మొత్తం 100 బ్లాకుల్లో 4,800 ప్లాట్లు నిర్మించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి విడతలో అర్హులుగా గుర్తించిన లబ్ధిదారులకు అందించేందుకు 40 బ్లాకుల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో ఇప్పటి వరకు 20 ప్లాట్లు మాత్రమే నివాస యోగ్యంగా నిర్మించారు. మరో 20 ఫ్లాట్లు 80 శాతం మేర పూర్తి చేసారు. మిగిలినవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి.

సంక్రాంతికి ముందే ఇళ్లు అప్పగించాలి



టిడ్కో ఇళ్లను తక్షణం లబ్ధిదారులకు అప్పగించాలి. ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అప్పగిస్తామంటూ చెప్పిన టీడీపీ నాయకులు ఇప్పటి వరకూ నోరు మెదపకపోవడం దారుణం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్రాంతికి ముందే టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి, ఏలూరు

అర్హులకు టిడ్కో ఇళ్లు కేటాయించాలి



టిడ్కో ఇళ్లను తక్షణం అర్హులకు అందజేయాలి. ఎన్నో ఏళ్ల నుంచి ఏలూరులోని వందల మంది లబ్ధిదారులు టిడ్కో ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. టీడీపీ నాయకుల నిర్లక్ష్యం కారణంగా పేదలకు నిరాశే ఎదురైంది. తక్షణం లబ్ధిదారులకు వాటిని అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– డీఎస్‌వీడీ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ, ఏలూరు

క్లుప్తంగా

వర్గ విభేదాలకు వ్యతిరేకంగా భక్త కనకదాసు పోరాటం


భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): భక్త కనకదాసు జయంత్యుత్సవాలు ఏలూరు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆర్.నాగరాణి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పుష్పలత భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ భక్త కనకదాసు సమాజంలో వర్గ విభేదాలు, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని, సమాజంలో ధనిక, పేద వర్గాల మధ్య తారతమ్యాలను రూపుమాపడానికి తన రచనల ద్వారా ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది చిట్టిబాబు, తిరుపతిరావు, బీసీ కార్పొరేషన్‌కు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలి



చాటపర్రు సచివాలయం అధికారి వినతిపత్రాలు అందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేసారు. సీపీఐ రాష్ట్ర సమితి, ఏపీ వ్యవసాయ, కార్మిక సంఘం పిలుపు మేరకు సోమవారం పార్టీ నాయకులు చాటపర్రులో సచివాయల ఉద్యోగులకు అర్జీలు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో ఇల్లు లేని పేద కుటుంబానికి 3 సెంట్లు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు రుణం అందించాలన్నారు. వీటితో పాటు ఇటుక, సిమెంట్, ఐరన్ తదితర నిర్మాణ సామగ్రిని ఉచితంగా అందించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుప్పాల కన్నబాబు, మండల కార్యదర్శి పొట్టేలు పెంటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బుగ్గల ప్రభాకర్, అరిగెల యోహాను, కోరాడ నాగేశ్వరరావు, బి రాజు, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి కంది పప్పు వితరణ


దీపక్ నెక్స్‌జన్ ఎండీ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పది మందికీ అన్నదానం చేసే శక్తి, ఆసక్తి కలగడం పూర్వజన్మ సుకృతమని అన్నపూర్ణ సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి అన్నదాన సమాజం అధ్యక్షుడు కొట్టు మధువెంకటరావు అన్నారు. స్థానిక రామకోటి ప్రాంగణంలో ఈ నెల 8న ప్రారంభమైన మాలధారులకు అన్నదాన కార్యక్రమం డిసెంబర్ 23 వరకూ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి దీపక్ నెక్స్‌జన్ సంస్థ తరపున రూ.2 లక్షల విలువ చేసే కందిపప్పును ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం రామకోటి ప్రాంగణంలో దాత సుబ్రహ్మణ్యంను అన్నదాన సమాజం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

నారాయణరావుకు ఏపీటీఎఫ్ మద్దతు

ఏలూరు (టూటౌన్): ఉభయగోదావరి జిల్లాల పరిధిలో డిసెంబరు 5న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డాక్టర్ గంధం నారాయణరావుకి మద్దతు ఇవ్వనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి తెలిపారు. స్థానిక ఇప్టా జిల్లా కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన నారాయణరావు అభ్యర్థిత్వాన్ని పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరుస్తున్నాయని అన్నారు. ఏపీటీఎఫ్ తరుపున రాష్ట్ర కార్యదర్శి కె.భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.శ్యాంసుందర్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం నారాయణరావు, ఏపీటీఎఫ్ జిలాల ప్రధా న కార్యదర్శి బి.రెడ్డిదొర, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, తూర్పుగోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు డి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

- జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి
- దివ్యాంగురాలికి వీల్ ఛైర్ అందజేత


దివ్యాంగురాలికి వీల్‌ఛైర్ అందజేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నూజివీడుకు చెందిన కె.సంజనాప్రియకు వీల్‌ఛైర్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి సంజనాప్రియను పలకరిస్తూ బాగా చదువుకోవాలని సూచించారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తూ వారికి సహాయంగా ఉంటామన్నారు. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు ఉపయోగపడే వీల్ ఛైర్లు అందించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలైన సంజనాప్రియ అర్జీని పరిశీలిస్తూ ఆమెకు ప్రస్తుతం అందుతున్న రూ.6వేల పెన్షన్‌ను రూ.15 వేలకు పెంచే విషయంపై అవసరమైన చర్యలు తసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరి కోత యంత్రాల కిరాయిలను నియంత్రించాలి


మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): రోజురోజుకు అమాంతం పెరుగుతున్న వరి కోత యంత్రం కిరాయిలను నియంత్రించాలని, అధిక కిరాయిల వసూలును అధికారులు అడ్డుకోవాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మీకోసంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డికి రైతులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని, వాతావరణ మార్పు పరిస్థితులను ఆసరా చేసుకుని వరి కోత యంత్రాల కిరాయిలు భారీగా పెంచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గంటకు రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారన్నారు. చాలాచోట్ల వరి పంట నేలకొరిగిపోవడంతో యంత్రంతో కోత సమయం మూడు గంటల వరకు పడుతుందని, ఎకరా వరి పంట కోయడానికి రూ.10 వేలుకు పైగా రైతు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. వరి కోత యంత్రాల కిరాయిలపై నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు, కౌలు రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, కౌలురైతులు పాల్గొన్నారు.

ఇద్దరు దాతల నుంచి కార్నియాల సేకరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తాము మరణించిన అనంతరం కొంతమంది అంధులకు చూపు ప్రసాదించాలనే లక్ష్యంతో నేత్ర దానం చేసి ఆదర్శంగా నిలిచారు వంకదారు రామమోహనరావు, ఎం. ధర్మారావు. ఇటీవల మృతి చెందిన ఈ ఇద్దరు దాతల మృతదేహాల నుంచి వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియాలు సేకరించినట్లు లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చిన దాతలు నగరానికి చెందిన వంకదారు రామమోహనరావు, కొప్పాక గ్రామానికి చెందిన ఎం. ధర్మారావు ఇటీవల మృతి చెందారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధులకు కుటుంబ సభ్యులు సమాచారం అందించడంతో వారు దాతల నేత్రాల నుంచి కార్నియాలు సేకరించారని రామారావు తెలిపారు. ఈ కార్నియాల ద్వారా నలుగురు అంధులకు చూపు వస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తాము మరణించిన తరువాత కూడా జీవించేలా నేత్రాలు, అవయవ దానం చేయాలని, కార్నియాల సేకరణకు సహకరించిన దాత కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అన్న క్యాంటీన్ల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): అన్న క్యాంటీన్లలో పనిచేసే సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య డిమాండ్ చేశారు. బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఆయన మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఏలూరులో నాలుగు అన్న క్యాంటీన్లు నిర్వహిస్తున్నారని, ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రజానీకానికి సేవలందిస్తున్నాయని ఆయన తెలిపారు. అందులో పని చేసే సిబ్బంది సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. సిబ్బంది ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకూ పని చేయాల్సి వస్తోందని తెలిపారు. కష్టపడి పని చేసినా సిబ్బందికి సరైన జీతాలు లేవని, ఇచ్చే అరకొర జీతాలు సకాలంలో అందించడం లేదని ఆయన తెలిపారు. గత నెలలో ఇవ్వాల్సిన జీతాలు నేటికీ చెల్లించలేదని తెలిపారు. సిబ్బందిని నియమించే సందర్భంలో కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.9 వేలు, ఇతర సిబ్బందికి రూ.8 వేలు చెల్లిస్తామని చెప్పి, ఇప్పుడు వెయ్యి రూపాయలు చొప్పున తగ్గించి ఇస్తున్నారని, ఆయన తెలిపారు. ప్రారంభంలో చెప్పిన విధంగా జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతినెల 5వ తేదీ లోపు జీతాలు ఇవ్వాలని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు, ప్రభుత్వం స్పందించి అన్న క్యాంటీన్ల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని పక్షంలో సీఐటీయూ తరపున ఆందోళన చేపడతామని తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో నగరంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ రమణ ఆధ్వర్యంలో గ్రంథాలయాల ప్రాముఖ్యత అంశంపై వ్యాసరచన పోటీలు, జై జవాన్ – జై కిసాన్ అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ డ్రాయింగ్ టీచర్ లక్ష్మి నాగేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు ఎం. హరిత, డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణ రావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, ఉపాధ్యాయులు, కార్యాలయం సిబ్బంది, జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ రీడింగ్ వర్సెస్ బుక్ రీడింగ్ అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు విద్యార్థులకు జనరల్ అవేర్నెస్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై క్విజ్ పోటీలు సీనియర్, జూనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో 200 మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్ర్రాల్లో మొక్కలు పెంచాలి


అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి కిరణ్

ఏలూరు (టూటౌన్): ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తమ కేంద్రాల్లో మొక్కలను విరివిగా పెంచాలని ఉద్యానవనశాఖ అధికారి కిరణ్ కోరారు. స్థానిక ఐసీడీఎస్ ఏలూరు అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ వాటిక కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కిరణ్ అంగన్‌వాడీ కార్యకర్తలకు మొక్కల పెంపకంలో పలు సూచనలు, సలహాలు అందజేసారు. ఈ సమావేశంలో సీడీపీఓ ఏ.పద్మావతి, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో వైభవంగా కార్తీక పూజలు


దత్తక్షేత్రంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కార్తీక మాసం మూడవ సోమవారం పర్వదినం సందర్భంగా నగరంలోని పలు శైవక్షేత్రాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో తెల్లవారుజామునే స్వామివారికి రుద్రాభిషేకాలు, మహాన్యాసపూర్వక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆయా ఆలయాల్లో ధ్వజస్తంభాల వద్ద దీపాలు వెలిగించి స్వామివారికి పూజలు చేశారు. స్థానిక దొండపాడు దత్తనాథ క్షేత్రంలోని సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామికి విశేష పూజలు చేశారు. స్థానిక పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీప పూజ చేసి స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. శనివారపుపేట శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పవర్ పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జాము నుంచి భక్తుల గోత్రనామాలతో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నపూర్ణ అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు.

రామకోటిలో కోటి దీపోత్సవం

స్థానిక రామకోటి ప్రాంగణంలో అన్నపూర్ణ సహిత హరిహర పుత్ర అయ్యప్ప స్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూట యాభై మూడు జంటలు లక్ష ఒత్తుల దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ద్వారకా తిరుమల, అన్నవరం, విజయవాడ అమ్మ వారి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. హరినామ సంకీర్తన భక్తులను అలరించిందని కొట్టు మధు వెంకట రావు తెలిపారు.

వినతుల వెల్లువ

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- బారులుతీరిన అర్జీదారులు


ప్రజల సమస్యలను నమోదు చేసుకుంటున్న అధికారులు


కలెక్టరేట్ లోపల బారులు తీరిన అర్జీదారులు


జేసీని వేడుకుంటున్న వృద్ధుడు


కలెక్టరేట్ వెలుపల అర్జీదారుల నిరీక్షణ


అర్జీ అందజేయడానికి వచ్చిన దివ్యాంగుడు

కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వినతిపత్రాలు అందజేస్తున్నా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమానికి హాజరైన అధికారులకు వినతులు అందజేసేందుకు అర్జీదారులు బారులుతీరారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. భూమి కబ్జా చేశారని ఒకరు, దివ్యాంగ పింఛన్ పెంచాలని మరొకరు, ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు కాలేదని, ప్రైవేటు కళాశాల యాజమాన్యం ఫీజుల ఒత్తిడి తట్టుకోలేకపోతున్నామంటూ విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరూ తమ సమస్యలపై అర్జీలు అందించేందుకు వచ్చారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు తమ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని అర్జీదారులు కోరుతున్నారు. పలువురు వృద్ధులు కూడా అర్జీలు అందజేసేందుకు కలెక్టరేట్‌కు తరలివచ్చారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఏలూరు

నేటి నుంచి విద్యాలయాల్లో చైతన్య సభలు


చైతన్య సభల బ్రోచర్‌ను ఆవిష్కరించిన నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): దేశభక్తి భారత రాజ్యాంగం పేరుతో ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు 12 రోజులు పాఠశాలలు, కళాశాలల్లో చైతన్య సభలు నిర్వహించాలని హేలాపురి బాలోత్సవం, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, భారత బచావో, బహుజన్ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపునిచ్చాయి. స్థానిక పవరుపేటలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఆ సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బోఫ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, భారత బచావో ఉభయగోదావరి జిల్లాల పెరియర్ పూలే అంబేద్కర్, బోఫ్ కమిటీ నాయకులు ఎస్కే కాసిం, హేలాపురి బాలోత్సవం కమిటీ నాయకులు వీవీ రాంబాబు, ఎస్ రవి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా 12 రోజుల కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుడిపాటి నరసింహారావు తేదీల వారీగా పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. రాజ్యాంగంపై నిర్వహించే సభల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. బోఫ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యాలయాల్లో చైతన్య సభలు నిర్వహించాలని కోరారు.